సాక్షి గుంటూరు

ఆదివారం । 12 । మే । 2024



ఘనంగా శివపార్వతుల కల్యాణం

ముప్పాళ్ళ: మండలంలోని కుందురువారి పాలెంలోని వాసవికన్యకాపరమేశ్వరి నగరేశ్వరస్వామి ఆలయ 37వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గణపవరంలో భారీ ర్యాలీ

రాజుపాలెం: ప్రచారం ముగింపు సందర్భంగా గణపవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు

ఇంటర్ ఆర్ఐఓ జీకే జుబేర్

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో ఇంటర్మీడియెట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని ఆర్ఐఓ జీకే జుబేర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తూ, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలల గుర్తింపు రద్దు చేయడంతో పాటు రూ.5 లక్షల అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. ఆదేశాలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం నిల్వలు, రవాణాను అరికట్టండి

ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఆదేశం



తెనాలి రూరల్: ఎన్నికల సందర్భంగా అనధికార మద్యం నిల్వలు, రవాణాను అరికట్టాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నోడల్ డిప్యూటీ కమిషనర్ కె.హేమంత్ నాగరాజు సిబ్బందిని ఆదేశించారు. తెనాలి ఎస్ఈబీ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా ఎస్ఈబీ సిబ్బంది చూడాల్సిన అవసరం ఉందని, మద్య రహిత ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. మద్యం నిల్వ చేసినా, పంపిణీ చేసినా సంబంధిత వ్యక్తులపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్‌తో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, ఎస్ఐ ఎ.పద్మజ ఉన్నారు.

మధ్యాహ్నం 12 గంటలకు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్





మార్మోగిన జగన్నినాదం

- సీఎం వైఎస్ జగన్ చిలకలూరిపేట సభకు పోటెత్తిన జనం
- మేమంతా సిద్ధం అని నినదించిన ప్రజలు
- చంద్రబాబు మోసాల పాలనను వివరించిన సీఎం
- ఐదేళ్ల ప్రజాపాలనలో జరిగిన మేలు గుర్తుచేసిన వైనం
- రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి మనోహర్‌నాయుడు, అనిల్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపు

సాక్షి, నరసరావుపేట: జై జగన్ జై జై జగన్... నినాదాలతో చిలకలూరిపేట పట్టణం మారుమోగింది. చిన్నా, పెద్ద, ఆడా, మగ అనే తేడా లేకుండా గొంతెత్తి నినదించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో శనివారం ఏర్పాటుచేసిన బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. జననేత రాకతో చిలకలూరిపేట జనసంద్రమైంది. సీఎం వైఎస్ జగన్ బహిరంగసభ వద్దకు చేరుకోగానే జగన్నినాదంతో ఆ ప్రాంతం మారుమోగింది. సీఎం ప్రసంగిస్తున్నంత సేపు నాయకులు, అభిమానులు ఉత్సాహంగా కనిపించారు. ప్రసంగంలో సీఎం ఇచ్చిన సిద్ధమా.. అనే పిలుపునకు సభికులంతా పిడికిలి బిగించి మేమంతా సిద్ధం అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ జగన్ ప్రసంగిస్తున్న సమయంలో గొంతు కలిపి బాబుకు వ్యతిరేకంగా నినదించారు. సీఎం బహిరంగసభలో మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు, జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ చైర్మన్ జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

పేదల తలరాతలు మారాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలి

వలంటీర్లు మరలా ఇంటికే రావాలన్నా... అవ్వాతాతల పెన్షన్ మళ్లీ ఇంటికే రావాలన్నా.. బటన్లు నొక్కిన పథకాల సొమ్ము మళ్లీ నా అక్కచెల్లెమ్మల ఖాతాలకు నేరుగా రావాలన్నా.. పథకాలన్నీ కొనసాగాలన్నా.. లంచాలు, వివక్ష లేని పాలన కొనసాగాలన్నా.. పేదల భవిష్యత్, పేదల తలరాతలు మారాలన్నా.. మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా.. మన వ్యవసాయం, మన ఆసుపత్రులు మెరుగుపడాలన్నా... ఇవన్నీ జరగాలంటే ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కాలని వైఎస్ జగన్ అన్నారు. ఈ ప్రసంగం సమయంలో ప్రజలు చేతులు పైకెత్తి ఫ్యాన్ గుర్తు చూపుతూ ఉత్సాహంగా మద్దతు పలికారు. ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కి 175కి 175 అసెంబ్లీ స్థానాలు, 25కి 25 ఎంపీ స్థానాలు ఒక్కటి కూడా తగ్గేందుకే వీలు లేదు. సిద్ధమేనా? అనే పిలుపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

చంద్రబాబు మోసం చేయడానికి వస్తున్నాడు ...

రేపు జరిగే కురుక్షేత్ర యుద్ధం కేవలం ఎమ్మెల్యే, ఎంపీలను ఎన్నుకొనే ఎన్నికలు కాదని, మీరు వేసే ఓటు మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని సీఎం జగన్ అన్నారు. ఈ ఎన్నికలలో జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు, పొరపాటున చంద్రబాబుకు ఓటువేస్తే పథకాలన్నీ ముగింపేనన్నారు. ఈ 59 నెలల పాలనలో లంచాలు, వివక్షలేని పాలన అందించామని సీఎం జగన్ అన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసాల పుట్ట అని సీఎం పేర్కొన్నారు. 2014లో ఏం చెప్పాడు, 2014 నుంచి 2019 మధ్య ఎంతటి మోసపూరితమైన పాలన అందించాడో ఒకసారి గుర్తుచేసుకోవాలన్నారు. 2014 మేనిఫెస్టోను చూపించి అందులో రాసిన హామీలు అమలయ్యాయా అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికి కొత్త మేనిఫెస్టోతో వస్తున్నాడు గమనించాలని కోరారు.

ఎన్నికల సంగ్రామానికి సర్వం సిద్ధం

- రేపే సార్వత్రిక ఎన్నికలు
- 19,91,543 ఓటర్లు... 1915 పోలింగ్ కేంద్రాలు
- పోటీలో లోక్‌సభకు 30 మంది.. 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 132 మంది అభ్యర్థులు
- నేడు ఈవీఎంల పంపిణీ
- ప్రశాంత ఎన్నికలకు ప్రజల సహకారం అవసరం
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, పక్కన ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు వెస్ట్: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల మహా సంగ్రామానికి సమయం ఆసన్నమయ్యింది. సోమవారం ఉదయం ప్రారంభమయ్యే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని మీడియా సమావేశ మందిరంలో ఎస్పీ తుషార్ డూడీతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19,91,543 ఓటర్లున్నారన్నారు. వీరిలో 17,61,675 మందికి ఇప్పటికే ఓటరు స్లిప్పులు పంపిణీ చేశామన్నారు. ఎవరికైనా ఓటరు స్లిప్పు రాకపోతే ఆయా పోలింగ్ కేంద్రాల్లోని ఓటరు లిస్టులో పేరుంటే ఏదైనా గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయొచ్చన్నారు. పార్లమెంట్‌కు 30, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు 132 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 3వ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా అధికారులను మొత్తం 13,800 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాలు శనివారం సాయంత్రం 6 గంటలకే ముగిశాయన్నారు. రాజకీయ పార్టీలుగాని, ఇతరులు గాని ఎటువంటి ప్రచారాలుగాని, ప్రలోభాలుగాని, మీటింగ్‌లు ఏర్పాటు చేయకూడదన్నారు. ప్రచారం కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు జిల్లా వదిలి వెళ్లాలని చెప్పారు. ఎటువంటి ఇబ్బంది ఉన్నా సి-విజిల్ యాప్‌తోపాటు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నెంబర్ 0863–2234301 నెంబర్‌కు తెలియజేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా 1543 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసామన్నారు. ప్రతీ అంశం రికార్డవుతుందని తెలిపారు.

నేటి ఉదయం ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్..

కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 7 గంటలకు నిర్దేశించిన ప్రాంతాల్లో ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ జరుగుతుందన్నారు. గుంటూరు వెస్ట్ పరిధిలో లాడ్జి సెంటర్‌లోని ఏఈఎల్ బీఎడ్ కాలేజీ, ఈస్ట్‌కు స్థానిక ఏసీ కాలేజీ, ప్రత్తిపాడుకు టీజేపీఎస్ కాలేజీ, తాడికొండకు జేకేసీ కాలేజీ, మంగళగిరికి ఆత్మకూరులోని నిర్మల కాన్వెంట్, తెనాలికి జేఎంజే ఉమెన్స్ కాలేజీలో అందజేస్తారన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు 487 వాహనాలకు ఏర్పాటు చేసామని దీనికి జీపీఎస్‌లు కూడా అమర్చామన్నారు. 176 సెక్టార్ అధికారుల ఆధ్వర్యంలో వెళ్లాలన్నారు.

పూర్తయిన మూడో ర్యాండమైజేషన్

పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సోమవారం జరగనున్న ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 3వ ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా అధికారులను సిబ్బందిని నియమించామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఎన్నికల పరిశీలకులు నీరజ్ కుమార్, కార్తీక, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సమక్షంలో 3వ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్‌తో సహా 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1915 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. రిజర్వు సిబ్బందితో కలిపి పీఓలు 2300, ఏపీఓలు 2300 ఓపీఓలు 9200 మొత్తం 13,800 మందిని కేటాయించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధులకు హాజరయ్యే వారు అత్యంత పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీలు విజయం కోసం పోరాడే సందర్భంలో ఏర్పడే చిన్న చిన్న ఇబ్బందులను లౌక్యంతో ఎదుర్కోవాలన్నారు. సిబ్బందికి పోలీసుల సహకారముంటుందన్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్నికల ప్రక్రియ అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో సజావుగా సాగిందన్నారు. సమావేశంలో డీఆర్ఓ పెద్ది రోజా, డీఈఓ శైలజ, అధికారులు పాల్గొన్నారు.

అలజడికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ఎస్పీతుషార్ డూడీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు 4000 సిబ్బంది అధికారులతో పాటు సీఆర్‌పీఎఫ్, అటాకింగ్ ఫోర్స్ తదితర యూనిట్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శించి అలజడి సృష్టించేందుకు కారణమైతే కఠినంగా అణచివేస్తామని హెచ్చరించారు. ఎన్నికల తర్వాత కూడా తమ నిఘా కొనసాగుతుందని తెలిపారు.

జిల్లాకు క్యూఆర్టీ పోలీస్ బృందాలు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

- ఈవీఎంలు తరలింపుపై పటిష్ట బందోబస్త్
- సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల అధికారులతో సమావేశం

నగరంపాలెం: జిల్లాలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా క్యూఆర్టీ పోలీస్ బృందాలు అందుబాటులో ఉంటాయని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాకు విచ్చేసిన సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, తమిళనాడు, తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల అధికారులతో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లోని హాల్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. సార్వత్రిక ఎన్నికల్లో చేపట్టాల్సిన జాగ్రత్తలు, విధుల కేటాయింపు, ఎన్నికల నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు కట్టుదిట్టమైన పోలీస్ భద్రతా ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. సమస్యాత్మకమైన పోలింగ్ బూత్‌ల వద్ద అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా పరిధిలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ బూత్‌ల వివరాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలపై అవగాహనతోపాటు, తగిన జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఏదైనా సంఘటనలు జరిగితే వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా క్యూఆర్టీ బృందాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇక జిల్లాలో ఓటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలను ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తామన్నారు. గుంటూరు తూర్పు ఏఎస్పీ నిచికేత్ షెల్కే, శిక్షణ ఐపీఎస్ మనోజ్ హెగ్డే, జిల్లా ఏఎస్పీ (ఎల్/ఓ) శ్రీనివాసరావు, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ జి.ఎస్.నేగి, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ప్రతామేష్ పవార్, డీఎస్పీ శాంతకుమార్ (ఏఆర్), తమిళనాడు, తెలంగాణ, ఇతరత్రా రాష్ట్రాల పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం

ప్రైవేటు పాఠశాలల సంఘం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథం పేరిరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటేనే సంక్షేమాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భీమనాథం పేరిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం బ్రాడీపేటలోని ఓ హోటల్లో పేరిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోకు, ఆచరణ సాధ్యం కాని హామీలతో వచ్చిన టీడీపీ మేనిఫెస్టోకు తేడాను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన సీఎం వైఎస్ జగన్ పేదరికంలో మగ్గుతున్న పిల్లలకు అండగా నిలిచారని చెప్పారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, సీబీఎస్‌ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం బోధనతో భావితరాలకు బంగారు భవిష్యత్ అందిస్తున్న జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి బండ్లమూడి రోజారాణి, కాపు సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల శ్రీనివాసరావు, ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిపై విద్యార్థులు దృష్టి సారించాలి

రాష్ట్ర జ్యుడిషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ శివశంకరరావు



తాడేపల్లి రూరల్: విద్యార్థులు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని, తద్వారా ఉన్నత ఉద్యోగ అవకాశాలు మన రాష్ట్రంలో లభిస్తాయని రాష్ట్ర జ్యుడిషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బి.శివశంకరరావు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ శనివారం నిర్వహించిన డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలు నిలబెట్టేలా విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ సాధించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిపై ఆలోచించాలన్నారు. సాంకేతిక విద్యావిధానంలో సృజనాత్మకత, పరిశోధనా సరళి అవసరమని, నాణ్యమైన విద్యావిధానం విద్యార్థులకు అందుబాటులో ఉండటం సంతోషకరమన్నారు. కేఎల్‌యూలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, ప్రపంచస్థాయి మౌలిక వసతులు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ గత 43 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులు ఇక్కడ చదివి దేశ విదేశాల్లో స్థిర పడ్డారని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో 4,000, అంతర్జాతీయ స్థాయిలో 26, ఇంటర్న్‌షిప్‌లు 29 మంది ఉద్యోగాలు సాధించారని వివరించారు. డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు నమోదైన అత్యధిక ప్యాకేజీ వార్షిక జీతం రూ.33.15 లక్షలుగా వివరించారు. ఉద్యోగ కల్పనల డీన్ డాక్టర్ ఎస్‌బీవీ ప్రసాద్ మాట్లాడుతూ 2005 నుంచి 18 సంవత్సరాలుగా వందశాతం ప్లేస్‌మెంట్స్ సాధిస్తున్నామని, ప్రతి ఒక్క విద్యార్థికి ప్లేస్‌మెంట్ వచ్చేలా మొదటి సంవత్సరం నుంచే శిక్షణ ఇస్తున్నామని వివరించారు. విల్‌శ్రీ గ్రూప్ చైర్మన్ ఎం.డి. విల్లియం కేర్ మానికొండ మాట్లాడుతూ కేఎల్‌యూలో అధునాతన లేబొరేటరీలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ఉన్నత అవకాశాలు లభించేలా వర్సిటీ అధ్యాపకులు కృషి చేయడం అభినందనీయన్నారు. అనంతరం యూనివర్సిటీ వీసీ, తదితరులు రాష్ట్ర జ్యూడిషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బి.శివశంకరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్టూడెంట్స్ ప్రొగ్రెషన్ నైపుణ్యాల అభివృద్ధి డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, ప్లేస్‌మెంట్స్ విభాగం డీన్ డాక్టర్ ఎస్.బి.వి.ప్రసాద్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

న్యాయవాదులను ఆదుకున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- హైకోర్టు లీగల్ సెల్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- హాజరైన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పోతుల సునీత

మంగళగిరి: వైఎస్సార్ లా నేస్తంతో న్యాయవాదులను ఆదుకున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. శనివారం నగర పరిధిలోని ఆత్మకూరులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ హైకోర్టు లీగల్ సెల్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, పోతుల సునీత, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, సునీత మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకునేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ లా నేస్తం ప్రవేశపెట్టారన్నారు. న్యాయవాదులంతా వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేసి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా న్యాయవాదులను గుర్తించి వారికి లా నేస్తం పథకం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదన్నారు. న్యాయవాదులంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవడంతో పాటు మంగళగిరిలో లావణ్య విజయం కోసం న్యాయవాదులమంతా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

మహిళ కడుపు నుంచి 14 కిలోల కణితి తొలగింపు

అరుదైన శస్త్రచికిత్స చేసిన శ్రేష్ట హాస్పటల్ వైద్యులు

గుంటూరు మెడికల్: కడుపులో నొప్పి, శ్వాస ఇబ్బందితో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన 55 సంవత్సరాల మహిళ కడుపు నుంచి 14 కిలోల కణితి తొలగించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు శ్రేష్ట హాస్పటల్‌కు చెందిన వైద్య బృందం వెల్లడించారు. శనివారం స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లోని శ్రేష్ట హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అరుదైన శస్త్రచికిత్స వివరాలను మీడియాకు వివరించారు. గుంటూరుకు చెందిన 55 సంవత్సరాల మహిళ తీవ్ర అనారోగ్యంతో తమ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిందన్నారు. ఆమెకు వైద్య పరీక్షలు చేయగా కడుపులో 35 సెంటీమీటర్ల పొడవు ఉన్న 14 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. పేగులకు అతుక్కుని ఆపరేషన్ చేసేందుకు కష్టంగా ఉన్న కణితి నుంచి తొలుత పది లీటర్ల ద్రవాన్ని బయటకు తీశామన్నారు. గతనెలలో అరుదైన శస్త్రచికిత్స చేసి కణితి తొలగించి బయాప్సీ చేయగా క్యాన్సర్ లేదని నిర్ధారణ జరిగిందన్నారు. ఆరోగ్యం కుదుటపడడంతో ఆపరేషన్ చేసిన నాలుగు రోజుల్లోనే మహిళను డిశ్చార్జి చేశామన్నారు. మహిళలు తరచుగా వైద్య పరీక్షలు, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా కణితులను ముందస్తుగానే గుర్తించవచ్చన్నారు. కణితులు పెరిగితే క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉందని, తద్వారా ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందన్నారు. శరీరంలో ఎలాంటి ట్యూమర్లు ఉన్నా అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలని వైద్యబృందం వెల్లడించారు. సమావేశంలో శ్రేష్ట హాస్పటల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మణస్వామి, గైనకాలజిస్టులు డాక్టర్ లక్ష్మీకాంతం, డాక్టర్ కీర్తి, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ మొయిన్, డాక్టర్ విద్యాసాగర్, మత్తు వైద్యనిపుణురాలు డాక్టర్ సాహితి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వైద్య బృందం

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధం



నూరి ఫాతిమా

నెహ్రూనగర్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా పేర్కొన్నారు. శనివారం తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఫాతిమా విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారంతో ఎన్నికల ప్రచారం పూర్తయిందని, ఇంత కాలం చేసిన ప్రచారం ఎన్నికల ప్రచారంలాగా లేదని, వారిని అప్యాయంగా కలిసి మమేకమయినట్లు ఉందన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై మాట్లాడినందుకు ముస్లిం కుటుంబంపై టీడీపీ నాయకులు దాడి చేశారని, అధికారంలోకి రాకముందే ఇలా దాడులు జరిపితే రేపు అధికారంలోకి వస్తే సామాన్య ప్రజానీకం బ్రతికే పరిస్థితి ఉండదన్నారు. ప్రజలు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఓట్లు వేయాలని కోరారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

సామాజిక న్యాయం అమలు చేస్తున్న జగనన్న

ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత



మేడికొండూరు : బడుగు, బలహీన వర్గాలను గుర్తించి ప్రాతినిధ్యం కల్పిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సామాజిక న్యాయం అమలు చేస్తున్న సమసమాజ స్థాపకుడు జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత కోరారు.మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో శనివారం సుచరిత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సుచరిత మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను గుర్తించి ప్రాతినిధ్యం కల్పిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సామాజిక న్యాయం అమలు చేస్తున్న సమసమాజ స్థాపకుడు మన జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణం పెంచడమే అసలైన అభివృద్ధి అన్నారు. ఎన్నడూ లేనంత సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్న మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభా త్రివేణి శివయ్య, పార్టీ గ్రామ నాయకుడు శౌరెడ్డి జైపాల్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి, కంకణాలపరమేశ్వరరావు, విజయమ్మ, సాంబశివరావు, పిల్లి నరేష్, పాపారావు, కాశిమల్ల సుమన్, మిరియాల శివరామకృష్ణ, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, ఆవుల సంజీవరెడ్డి, అల్లు శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, కె.కిషోర్, పలు గ్రామాల సర్పంచ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఐదేళ్ళలో చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

మంగళగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ళలో మంగళగిరిలో చేసిన అభివృద్ధే వైఎస్సార్ సీపీని గెలిపిస్తుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి సమ సమాజ స్థాపనకే బీసీ మహిళ అయిన మురుగుడు లావణ్యను ఎంపిక చేశారన్నారు. తాను రెండు సార్లు మంగళగిరిలో విజయం సాధించినా బీసీ మహిళను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం సాధించడం తథ్యమన్నారు. ఐదేళ్ళలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ప్రజలందరికీ తెలుసని అనమ్మకమే మరలా వైఎస్సార్ సీపీని ప్రజలు ఆదరిస్తారనే విశ్వాసం వుందన్నారు. లావణ్య విద్యావంతురాలు సమాజ అభివృద్ధి కొరకు పాటు పడాలనే తపన వున్న మహిళ అని ప్రజలంతా ఆదరించాలని కోరారు.

‘27వ మైలురాయి’ కి ప్రథమ బహుమతి

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంఘిక నాటక, సాంఘిక నాటికల పోటీల ఫలితాలను శనివారం ప్రకటించారు. సాంఘిక నాటకం విభాగంలో పీటీ మాధవ్ రచించిన ‘27వ మైలురాయి’ నాటకం ప్రథమ బహుమతిని గెలుచుకుంది. రచయితకు స్వర్గీయ ఆరిశెట్టి శివన్నారాయణ జ్ఞాపకార్థం రూ.25 వేల నగదు బహుమతిని ఆయన మిత్రబృందంచే బహూకరించనున్నట్టు తెలిపారు. కేవీవీ సత్యనారాయణ రచించిన ‘నెత్తురు’ సాంఘిక నాటకం ద్వితీయ బహుమతి రూ.15 వేలను గెలుచుకుందన్నారు. కీ.శే పరాంకుశం వెంకట భవానీ ప్రసాద్ (బాబ్జీ) జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు ఈ బహుమతిని అందచేస్తారని తెలిపారు. సాంఘిక నాటికల విభాగంలో సీహెచ్ సింహప్రసాద్ రచన ‘వాన’ప్రస్థానం’ నాటిక ప్రథమంగా నిలిచిందని తెలిపారు. రచయితకు కీ.శే భారతుల రామకృష్ణ జ్ఞాపకార్థం రూ.20 వేల నగదు బహుమతిని రామకృష్ణ సతీమణి బహుకరిస్తారని తెలిపారు. మద్దుకూరి రవీంద్రబాబు రచన ‘మా యింట్లో మహాభారతం’ నాటికకు ద్వితీయ బహుమతి లభించిందని, కీ.శే గంధం నాగరాజు జ్ఞాపకార్థం ఆయన తండ్రి రూ.10 వేల నగదును అందచేస్తారని వివరించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కేవీ బలరామమూర్తి, భట్టిపూడి శ్రీనివాస సుబ్బారావు వ్యవహరించినట్టు తెలిపారు.



వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా శనివారం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ప్రచారానికి చివరి రోజు కావడంతో ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, గిరి, జిల్లా అధ్యక్షుడు ఎం.శేషగిరిరావుతో కలిసి విస్తృత ప్రచారం చేసి, ఓట్లు అభ్యర్థించారు. - పట్నంబజారు



వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి, మంత్రి విడదల రజిని 35వ డివిజన్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. పట్టాభిపురం స్వామి థియేటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రవీంద్రనగర్ వరకు కొనసాగింది. 2019 మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను 99 శాతం పూర్తిచేసిన గొప్ప నాయకుడు జగనన్న అని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి పాల్గొన్నారు. - పట్నంబజారు

ప్రచార పర్వం



దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో వైఎస్సార్ సీపీ మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు ఇస్తూ ఘనస్వాగతం పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, పేదలకు మేలు జరగాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. - తాడేపల్లిరూరల్

వాగ్దానాలా.. పప్పు బెల్లాలా!

గెలుపుపై నమ్మకం లేక ఎడాపెడా హామీలు ఇస్తున్న లోకేష్

- 20 వేల ఉద్యోగాలు, 23 వేల ఇళ్లు..
- రూ.300 పెన్షన్ నాలుగు వందలు చేస్తారంటా..
- ప్రతి సమావేశంలోనూ తడబాటే...
- దీంతో రంగంలోకి దిగిన కుటుంబ సభ్యులు
- మంగళగిరి నియోజకవర్గంలో పెద్దగా తిరగని లోకేష్
- అధికారంలో ఉన్నప్పుడు తొలగించిన ఇళ్లకే దిక్కులేదు
- ప్రశ్నిస్తున్న పలువురు టీడీపీ కార్యకర్తలు
- మరోసారి ఓటమి దిశగా లోకేష్

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తాడేపల్లి రూరల్: అలవి కానీ హామీలు, బూటకపు వాగ్దానాలతో ఎలాగైనా గెలవాలని మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ పీట్లు చేస్తున్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో 20 వేల ఉద్యోగాలు ఇప్పిస్తానని, 23 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తానని చెబుతున్నారు. వీటికి సంబంధించి స్థలం ఎలా, ఎక్కడ సేకరిస్తారనే విషయం గురించి నోరు విప్పడం లేదు.

➡ మంగళగిరి నియోజకవర్గంలో 2019లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేతిలో ఓడిపోయిన మూడు శాఖల మంత్రి నారా లోకేష్ తిరిగి 2024లో మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీకి దిగారు. ఆయనపై ఓ బీసీ అభ్యర్థి మురుగుడు లావణ్య వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి కావడం ఆయనకు మరోసారి పరాజయం కళ్ల ముందు కనపడుతుండటంతో పాటు నియోజకవర్గంలో ప్రజల మధ్యకు వెళ్లినప్పుడు సొంత పార్టీ కార్యకర్తల నుంచే అనేక ప్రశ్నలు వస్తుండటంతో గత వారం రోజులుగా నియోజకవర్గాన్ని వదిలి బయట ప్రచారం చేస్తూ వస్తున్నారు. చివరకు నామినేషన్ వేసేటప్పుడు కూడా నారా లోకేష్ రాకపోవడంతో నియోజకవర్గంలోని ప్రజలు నామినేషన్‌కే రాలేదు, ఇక మన సమస్యలు ఏమి తీరుస్తారని మాట్లాడుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించకుండా అక్కడక్కడా సభలు, సమావేశాలు ఏర్పాటు చేసిన సమయంలో వారి నాయకుల నుంచే అభివృద్ధి విషయంలో సమస్యలు తలెత్తాయి.

➡ సీతానగరంలో మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేస్తే వారి పార్టీ నాయకుల నుంచి పలు ప్రశ్నలు వచ్చాయి. 2017లో మా నివాసాలు తొలగిస్తున్నప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు? అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఇతర పార్టీ నాయకుల మాకు అండగా ఉండి ఇళ్లు తొలగించకుండా అడ్డుకున్నారు అని నిలదీశారు. అది మాకు తెలియదు అంటూ ఆయన సమాధానం చెప్పడంతో అక్కడ ఉన్న కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

ప్రచారంలోనూ తడబాటు

మంగళగిరిలో జరుగుతున్న ప్రచారంలో కూడా లోకేష్ తడబాటుకు లోనవుతున్నారు. ఒక సభలో ఆయన మాట్లాడుతూ పెన్షన్‌ను మూడు వందల నుంచి నాలుగు వందలు చేస్తామని ప్రకటించారు. పక్కన ఉన్నవారు సరి చేస్తే నాలుగు వేలు చేస్తామని చెప్పారు. అసలు పెన్షన్ ఎంత ఉందో కూడా తెలియని పరిస్థితిలో లోకేష్ ఉంటే తమకేం మేలు చేస్తాడని, నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.



➡ మంగళగిరిలో చేనేతల సమస్యలు పరిష్కరిస్తామని సభ ఏర్పాటు చేసి మాట్లాడుతున్న సమయంలో గతంలో ఆప్కోలో జరిగిన కుంభకోణం గురించి ప్రశ్నించగా ఆయన వద్ద నుంచి ఎటువంటి సమాధానం లభించలేదు. పలు ప్రాంతాల్లో సభలు, సమావేశాలు వారి కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమయంలో ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నం కావడంతో నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తే పార్టీ నుంచే వ్యతిరేకత వస్తోందని, సీనియర్ నాయకుల నుంచి తెలుసుకున్న నారా లోకేష్ గత 15 రోజుల నుంచి ఎక్కడా ప్రచారం నిర్వహించకుండా నేనున్నానంటూ అప్పుడప్పుడు కార్లలో అమరావతి కరకట్ట నుంచి మంగళగిరి వెళ్లి ముఖ్య నాయకులను కలుస్తున్నానంటూ కార్లలో ముగ్గురు నలుగురిని కలిసి వెళ్లిపోతున్నారు.

➡ ఓటమి భయంతో నియోజకవర్గంలో తిరగకుండా రాజకీయ అనుభవం లేని వ్యక్తులను హైదరాబాద్ నుంచి పిలిపించి సభలు నిర్వహిస్తున్నారు. ఎవరైనా తిరిగే సమయంలో మా ప్రాంతానికి ఏం చేస్తారని ప్రశ్నిస్తే వారికి ఏం తెలుసు? చినబాబు గారితో మాట్లాడదామని అక్కడి నాయకులు సమాధానం చెబుతూ కాలయాపన చేస్తున్నారు. మంగళగిరి నుంచి 2019లో అభాసుపాలైన నారా లోకేష్ మళ్లీ 2024లో ఎలాగైనా మంగళగిరిలో విజయం సాధించాలని చెబుతున్న ఎన్నికల హామీలను, మోసపు మాటలను ప్రజలు విశ్వసించడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మంగళగిరిలో నివసిస్తూ కనీసం నియోజకవర్గంలో ఒక్కపని చేయని లోకేష్, చంద్రబాబుల మాటలన్నీ బూటకమేనని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వస్తే 20 వేల ఉద్యోగాలు ఇస్తానని, ఉద్యోగం వచ్చే వరకు రూ.3000 నెలకు నిరుద్యోగ భృతి ఇస్తామంటున్న టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన ఇవే హామీలను ఎందుకు అమలు చేయలేదని నిరుద్యోగులు నిలదీస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు శాఖల మంత్రిగా పనిచేసిన లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో నివాసముంటూ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని, ఇప్పుడు ఎలా నమ్ముతామంటున్నారు.

నమ్మే పరిస్థితి లేదు..

రాజధాని పేరుతో 33 వేల ఎకరాల బంగారం పండే భూముల్ని లాక్కుని వాటిని ఎందుకూ పనికిరాకుండా చేశారని, అధికారంలోకి వస్తే రాజధాని అభివృద్ధి చేస్తామని కనీసం చెప్పలేకపోతున్న లోకేష్‌ను రాజధాని ప్రజలు ఎందుకు విశ్వసించాలని ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్న సమయంలో మంగళగిరిలో ప్రధాన రహదారి గౌతమ బుద్ధ రోడ్డు విస్తరించకపోగా తాడేపల్లిలో రోడ్ల విస్తరణ పేరుతో తొలగించిన నిర్వాసితులకు స్థలాలు ఇవ్వకుండా మోసం చేసిన ఘనత లోకేష్‌ది అని, చంద్రబాబు లోకేష్‌లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలుగుదేశం నాయకులే చెబుతున్నారు. 23 వేల మందికి ఇళ్లపట్టాలు ఇస్తానని బూటకపు హామీ ఇస్తున్నారని, వారికి భూములు ఎక్కడ నుంచి వస్తాయని, ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆర్కే ఆధ్వర్యంలో సీఆర్‌డీఏ పరిధిలో పట్టాలు ఇవ్వగా కొత్తగా ఏం ఇస్తారని ప్రజలు నిలదీస్తున్నారు. లోకేష్‌కు మరోసారి మంగళగిరిలో పరాభవం తప్పదని స్పష్టం చేస్తున్నారు. ఇదే తాడేపల్లిలో రోడ్లకు ఇళ్లు తొలగించిన నిర్వాసితులకు వెంటనే ఆత్మకూరులో పొలం కొని ఇళ్లు కట్టించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని చెబుతున్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో సీఆర్‌డీఏ ప్లాన్ అమలు చేస్తారా?

ఒక పక్కరాజధాని విషయమై మంగళగిరి నియోజకవర్గంలో ఎటువంటి స్పష్టత లేకుండా మాట్లాడుతూ బయట ప్రాంతాల్లో రాజధాని నిర్మిస్తామంటూ మాట్లాడుతున్న నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఉన్న సీఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ అమలు చేస్తే సుమారు 10వేల నివాసాలు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇక ప్రచారం మాత్రం ఎక్కడ ఇళ్లు నిర్మించుకుని ఉంటే అక్కడే ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇస్తున్నారు. రాష్ట్రం మొత్తం మీద ఇరిగేషన్, అటవీశాఖ భూముల్లో నివాసముంటున్న వారికి ఎక్కడా రెగ్యులరైజ్ చేయలేదు. మంగళగిరి నియోజకవర్గంలో 70 శాతం ఇరిగేషన్ భూముల్లో రెక్కాడితే గానీ డొక్కాడని ప్రజలు నివసిస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అనేకసార్లు వారికి నోటీసులు అందజేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే ఇళ్ల స్థలాలు కేటాయిస్తే వాటిని సైతం అడ్డుకున్నారని, దాంతో కింద స్థాయి టీడీపీ నాయకులను ప్రజలు ప్రశ్నించడంతో వారు సైతం ప్రచారంలో పాల్గొనలేకపోతున్నారు.

23 వేల మందికి ఇళ్ల స్థలాలు ఎక్కడ ఇస్తారు?

మంగళగిరి నియోజకవర్గ పరిధిలో మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో ఇళ్లులేని పేదలు 22 వేల మంది ఉండగా, దుగ్గిరాల మండల పరిధిలో 1000 మంది ఉన్నారు. ఎక్కడ నివసిస్తున్న వారికి ఆ ప్రాంతంలోనే రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని ప్రచారంలో ఊదరగొడుతున్నారు. తాడేపల్లిలో కానీ, మంగళగిరిలో కానీ ఇళ్ల స్థలాలు కేటాయించడానికి ఎక్కడ స్థలాలు ఉన్నాయి? ఏ విధంగా ఇస్తామని హామీ ఇవ్వలేకపోతున్నారు. 23 వేల మందికి రెండు సెంట్ల చొప్పున స్థలం కేటాయించాలంటే సుమారు 800 ఎకరాల వరకు స్థలం కావాల్సి ఉంది. ఆ స్థలం రైతుల దగ్గర నుంచి తీసుకుంటారా? లేదా వారు సేకరించిన 33 వేల ఎకరాల్లో ఇస్తారా అనేది ఎక్కడా స్పష్టంగా తెలపడం లేదు. రాజధానిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే ఇక్కడ పేద ప్రజలు నివసిస్తే సమతుల్యత దెబ్బతింటుందని కోర్టును ఆశ్రయించిన వారు మళ్లీ అక్కడ ఎలా ఇస్తారంటూ వారి పార్టీవారే ప్రశ్నిస్తున్నారు.

క్వాలిఫైడ్స్ జీవితాల్లో కాంతులు

డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్



గుంటూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసిన 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు (ఫైల్)

- 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్స్ అభ్యర్థులు 504 మందికి ఉపాధ్యాయ కొలువులు
- ఉద్యోగాలు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపిన నాటి సీఎం చంద్రబాబు
- ఏళ్ల తరబడి న్యాయంకోసం పోరాటాలు చేసిన నిరుద్యోగులు
- సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై హర్షాతిరేకాలు, ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగానికి పెద్దపీట వేసి రూ.వేల కోట్లు కేటాయిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల కుటుంబాల్లో దీపాలు వెలిగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువుల కోసం 1998లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా పరీక్షలు రాసి, అర్హత సాధించినప్పటికీ ఉద్యోగాలు రాక, ఏళ్ల తరబడి న్యాయపోరాటాలతో అలసిపోయిన అభ్యర్థులకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం న్యాయం చేసింది.

504 మందికి ఉద్యోగాలు

చరిత్రలో నిలిచిపోయేలా సుదీర్ఘ పాదయాత్ర చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వచ్చిన వందలాది సమస్యల్లో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల సమస్య ఒకటి. వారి సమస్యలు విని చలించిపోయిన వైఎస్ జగన్ పోస్టింగ్స్ అంశంపై నాడు ఇచ్చిన హామీని నెరవేర్చారు. 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు 2023 ఏప్రిల్‌లో పోస్టింగ్స్ కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఎంటీఎస్(మినిమమ్ టైం స్కేల్) పద్ధతిపై చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 229 మంది ఉద్యోగాలను పొందారు. అదే విధంగా హామీ ఇవ్వనప్పటికీ 2008 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌లో మరో 275 మందికి సైతం ఎంటీఎస్ పద్ధతిపై ఉపాధ్యాయులుగా నియమించారు.

మొండిచెయ్యి చూపిన నాటి సీఎం చంద్రబాబు

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు రాసి, క్వాలిఫై అయిన అభ్యర్థులు అప్పటి ప్రభుత్వం మొండిచేయి చూపడంతో ఉద్యోగాలను కోల్పోయారు. అప్పటి సీఎం చంద్రబాబు నిర్వాకంతో ఉద్యోగాలను పొందలేకపోయిన అభ్యర్థులు మంచి మనసున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో ఉద్యోగాలను పొందారు. ఎప్పుడో 25 ఏళ్ల నాటి విషయం మనకెందుకులే అని అనుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు, కష్టాలను తెలుసుకుని మానవత్వంతో మినిమం టైం స్కేల్ పద్ధతిపై ఉద్యోగాలు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు వెనువెంటనే నియామకాలు పూర్తి చేయించారు. కలగా మారి, ఇక ఉద్యోగాలు రావని నిరాశ, నిస్పృహలతో ఉన్న అభ్యర్థులు సీఎం వైఎస్ జగన్ పుణ్యమాని ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో ఆనందోత్సాహాల్లో నిండిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

25 ఏళ్ల తరువాత పిలిచి ఉద్యోగం ఇచ్చారు



25 ఏళ్ల క్రితం భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో డీఎస్సీ రాసి అర్హత సాధించాను. అయితే పోస్టులను కుదించేసి, తక్కువ సంఖ్యలో భర్తీ చేయడంతో ఆవేదన చెందాను. అప్పటి నుంచి ఎంతో ఆశగా ఎదురు చూశాను. 58 ఏళ్ల వయసులో ప్రభుత్వమే పిలిచి ఉద్యోగం ఇవ్వడం సామాన్యమైన విషయం కాదు. వైఎస్ జగన్ దయతో మా పిల్లలను ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా చదివించాను. ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న పరిస్థితుల్లో ఉద్యోగం ఇవ్వడం ద్వారా మా కుటుంబాన్ని ఆదుకున్నారు.

- షేక్ సైసావలీ, మాచర్ల

అధ్యాపకవృత్తి నుంచి ఉపాధ్యాయురాలిగా..



డీఎస్సీలో ఉద్యోగం రాకపోవడంతో వేర్వేరు డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక వృత్తిలోకి వెళ్లాను. గతేడాది ప్రభుత్వ మహిళా కళాశాలలో పీజీ కెమిస్ట్రీ గెస్ట్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సమయంలో ప్రభుత్వ పాఠశాలలో తిరిగి ఉపాధ్యాయురాలిగా ఉద్యోగాన్ని ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. కష్టానికి ప్రతిఫలంగా ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వడం మరువలేను.

- బి.సుచరిత, గుంటూరు

కలలో కూడా ఊహించలేదు



డీఎస్సీలో క్వాలిఫై అయినా ఉద్యోగం రాకపోవడంతో గతంలో న్యాయ పోరాటం చేశాం. న్యాయం చేయాలని గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసి జీవనం సాగిస్తున్న తరుణంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఉద్యోగాలను కల్పించడం కలలో కూడా ఊహించలేదు.

- బి.శ్రీనివాసరెడ్డి, ప్రత్తిపాడు

పద్మశాలీలకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ చేనేత విభాగ కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ వానపల్లి త్రిమూర్తులు



పన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలోని పద్మశాలి కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి అండగా నిలిచిందని వైఎస్సార్ సీపీ చేనేత విభాగ కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వానపల్లి త్రిమూర్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్మశాలి చేనేత కుటుంబాలకు రెండు ఎమ్మెల్సీలను కేటాయించి గౌరవించారని తెలిపారు. అలాగే మంగళగిరి సీటును మురుగుడు లావణ్యకు, ఎమ్మిగనూరు సీటును బుట్టా రేణుకకు ఇచ్చారన్నారు. ఆయా వర్గాలకు ఐదేళ్లలో రూ.3,706 కోట్లు ఖర్చు చేశారన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి..

ఆప్కోకు గత ప్రభుత్వ పాత బకాయిలు రూ.103 కోట్లతో సహా మరో రూ.468 కోట్లు ఇప్పటికే చెల్లించారని చెప్పారు. మంగళగిరి, వెంకటగిరి, చీరాలలో చేనేత కస్టర్లు ఏర్పాటు చేసి ఎంతో మంది చేనేత కార్మికులకు జీవనోపాధి కల్పించారన్నారు. ఐదేళ్లలో అడుగడుగునా పద్మశాలీలకు అండగా నిలిచిన వైఎస్ జగన్ ప్రభుత్వానికి అందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి రజని, చిత్రంలో విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ ఏసురత్నం, టీవీ రావు

- సంయమనంతో ముందుకెళదాం
- దొంగఓట్లను అడ్డుకుందాం
- మంత్రి విడదల రజిని
- బూత్ కన్వీనర్లు, ఏజెంట్లతో సమావేశం

పట్నంబజారు: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాలని బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని సూచించారు. స్థానిక గుంటూరు ఏ 1 కన్వెన్షన్‌లో శనివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సంయమనంతో ముందుకెళ్లాల్సిన సమయం వచ్చేసిందని చెప్పారు. ఈ రెండు రోజులు మనం చేసే కృషే గెలుపోటములను నిర్ణయిస్తుందని తెలిపారు. టీడీపీ కుట్రలు, కుతంత్రాలకు తెరతీసేందుకు సిద్ధంగా ఉందని, దొంగ ఓట్లతో చెలరేగే ప్రయత్నం చేస్తున్నారని, ఈ పన్నాగలను మనమే తిప్పికొట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికలు ఇవి అని చెప్పారు. ప్రజలకు న్యాయం జరగాలంటే, పేదలు ఆర్థికంగా మరింతగా నిలదొక్కుకోవాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. బూత్‌లలో అలజడులు సృష్టించాలని టీడీపీ ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయని, అలాంటి పరిస్థితి తలెత్తితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దమ్మున్న నాయకుడు: లేళ్ల అప్పిరెడ్డి

శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ తన పరిపాలన వలన మేలు జరిగింది అని అనుకుంటేనే ఓటేయండి అని అడిగిన దమ్మున్న నాయకుడు రాష్ట్ర చరిత్రలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని చెప్పారు. ఎమ్మెల్సీ ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాళి గిరి, సీనియర్ నాయకులు టీవీ రావు, చందు సాంబశివరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు, అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, ఆయా డివిజన్ల ఇన్‌చార్జిలు, పార్టీ అధ్యక్షులు, పాల్గొన్నారు.

'పశ్చిమ' ప్రజలు ఎంతో విజ్ఞులు

- ఐదునెలల్లో గుంటూరులో ఎన్నో అభివృద్ధి పనులు
- డయేరియా మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొన్నాం
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం
- ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు మంత్రి విడదల రజిని విజ్ఞప్తి

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అంతా చదువుకున్న విజ్ఞులే ఉన్నారని, ఏది మంచో, ఏది చెడో వారందరికీ తెలుసని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. ఈ నెల 13వ తేదీ ఎన్నికలు నేపథ్యంలో మంత్రి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు పశ్చిమలో ఒక్క అవకాశం ఇచ్చి, తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తనను గుంటూరు పశ్చిమ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించి ఐదునెలలే అయిందని, ఈ అతితక్కువ కాలంలోనే గుంటూరులో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలను పరిష్కరించామని వివరించారు. ఎన్నో రహదారులను తీర్చిదిద్దామన్నారు. అభివృద్ధి ప్రధాన అజెండా ముందుకు వెళతామని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో గుంటూరు నగరాన్ని రాష్ట్రంలో మేటిగా తీర్చిదిద్దుతామన్నారు. విద్య, వైద్యం వంటి కీలక రంగాల్లో మరింతగా నగరాన్ని ముందుకు తీసుకెళతామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పార్కు తీసుకొచ్చి యువతకు గొప్ప ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా ప్రజలకు సేవచేసే అవకాశం దక్కిందని, ఆ క్రమంలో ఎన్నో సంస్కరణల్లో భాగమయ్యానని గుర్తుచేసుకున్నారు. మంత్రిగా తాను శాయశక్తులా తన వంతు బాధ్యత పూర్తిగా నిర్వర్తించగలిగానని, వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణల్లో భాగస్వామిని కాగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంత్రిగా గుంటూరు నగర ప్రజలకు కూడా సేవ చేసే భాగ్యం కలిగిందని, నగరంలో డయేరియా ప్రబలిన సందర్భంలో తాను రేయింబగళ్లు శ్రమించి, రాష్ట్ర వైద్య శాఖలో ఉన్నత అధికారులందరినీ గుంటూరులోనే కేంద్రీకరించి డయేరియాను సమర్థవంతంగా అదుపు చేయగలిగానని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తనకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన తర్వాత ఈ ఐదు నెలల్లో తాను నగరంలో విస్తృతంగా పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేశానని చెప్పారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలబడితే పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.